క్లుప్తంగా

రైతులకు మెరుగైన సేవలే లక్ష్యం



మాట్లాడుతున్న పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి నూక నరసింగరావు

మునగపాక: రైతులకు మెరుగైన సేవలందించేందుకు పాలకవర్గం కృషి చేస్తుందని మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి విల్లూరి నూక నరసింగరావు అన్నారు. సంఘ అభివృద్ధికి రైతులు సహకరించాలన్నారు. స్థానిక పీఏసీఎస్ ఆవరణలో మునగపాక సహకార సంస్థ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపాజిట్ల సేకరణ, బంగారు ఆభరణాలపై రుణ సదుపాయంతో పాటు సొసైటీ ద్వారా రేషన్ సరకుల బట్వాడా వంటి సేవలు అందిస్తున్నామన్నారు. సంఘ సీఈవో పెంటకోట మహేష్ సంఘ నివేదికను చదివి వినిపించారు. జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు దాడి ముసిలినాయుడు, టెక్కలి కొండలరావు, కోనపల్లి రామ్మోహనరావు, సంఘ పర్సన్లు మొల్లి అప్పలరాజు, పొలిపిని రామారావు, నాగులాపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి యల్లపు వెంకట భాస్కరరావు, పలువురు రైతులు, సొసైటీ సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కుగ్రామం నుంచి ఆరుగురికి ప్రభుత్వ కొలువు



పి.కె.పల్లిలో కొత్తగా ఉద్యోగాలు సాధించిన వారిని సత్కరిస్తున్న గ్రామస్తులు

కోటవురట్ల: తమ గ్రామానికి చెందిన పలువురు యువకులు ప్రభుత్వ శాఖల్లోని వివిధ ఉద్యోగాలు సాధించడంతో ఆ గ్రామస్తుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. పి.కె.పల్లికి చెందిన ఎస్.నరసింహమూర్తి, ఆర్.దేవుడునాయుడు, ఎస్.నాగేశ్వరరావు ఇటీవల మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఎస్.అక్షిత, వై.రాజుబాబు, ఆర్.శివరామ్ వేర్వేరు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారు. దాంతో గ్రామానికి చెందిన రొంగల రామకృష్ణ, రొంగల నారాయణమూర్తి, గ్రామ పెద్దలు, యువకులు ఉద్యోగాలు సాధించిన ఆరుగురిని మంగళవారం ఘనంగా సత్కరించారు. వీరితో పాటు అదే గ్రామంలో ఉద్యోగాలు చేసి వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయిన మరో ఇద్దరికి కూడా సన్మానం చేశారు.

అధిక లోడుతో వెళ్తున్న వాహనానికి జరిమానా

మునగపాక: అధిక లోడుతో వెళ్తున్న భారీ వాహనానికి జరిమానా విధించినట్లు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. పూడిమడక రోడ్డులో మునగపాక సమీపంలో మంగళవారం రాత్రి అధిక లోడుతో వెళ్తున్న వాహనాన్ని పోలీసులు గుర్తించారు. వెంటనే వాహనాన్ని ఆపి రూ.67వేలు జరిమానా విధించారు. ఎవరైనా అధిక లోడుతో వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

వైస్ ఎంపీపీ ఈశ్వరరావుకు పరామర్శ



ఈశ్వరరావు ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కంబాల

నక్కపల్లి: పాము కాటుకు గురై నక్కపల్లి ఏరియాలో చికిత్స పొందుతున్న వైస్ ఎంపీపీ వెలగ ఎస్.ఈశ్వరరావును వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు మంగళవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్యం పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వీసం రామకృష్ణ, గోవిందు, తదితరులు ఈశ్వరరావును పరామర్శించారు.

జోరుగా నాటుకోళ్ల విక్రయాలు



సంతలో విక్రయానికి తీసుకువచ్చిన కోళ్లు

మాకవరపాలెం: స్థానిక వారపు సంతలో నాటుకోళ్ల విక్రయాలు జోరుగా సాగాయి. మంగళవారం జరిగిన వారపు సంతలో విక్రయించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి అధికంగా తీసుకువచ్చారు. దసరా పండగ సందర్భంగా స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు దారులు రావడంతో నాటుకోళ్లకు గిరాకీ ఏర్పడింది. రూ.500 ధర ఉండే కోడిని రూ.1000 వరకు విక్రయించారు.

ప్రయాణికులకు నిలువ నీడేది?

• శిథిలావస్థలో బస్ షెల్టర్లు • కూడళ్లలో వాహనాల కోసం ఆరుబయట నిరీక్షణ • పట్టించుకోని అధికారులు



అన్నవరం జంక్షన్‌లోని బస్ షెల్టరు దుస్థితి



సుంకపూరు జంక్షన్‌లో శిథిలావస్థలో ఉన్న షెల్టర్




పిచ్చిమొక్కల మధ్య తంగేడులోని బస్ షెల్టర్

కోటవురట్ల: ప్రయాణికులకు నిలువ నీడ లేకుండా పోయింది. ఎండకు, వానకు అవస్థలు పడుతూ రహదారులపైనే వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలో ప్రధాన రహదారుల్లోని కూడళ్లలో బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో బస్ షెల్టర్లు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా తయారయ్యాయి. చిన్నారులు, మహిళలు, వృద్ధులు వర్షం, ఎండా కాలాలలో వాహనాల కోసం ఇక్కట్లు పడుతూ ఎదురు చూస్తున్నారు. సుమారు 25 ఏళ్ల క్రితం ఎంపీ నిధులతో పలు కూడళ్లలో ప్రయాణికులు వేచి ఉండేందుకు వీలుగా బస్ షెల్టర్లు నిర్మించారు. కొన్నాళ్లు బాగానే ఉన్నప్పటికీ క్రమేపీ నిర్వహణ లోపంతో శిథిల స్థితికి చేరాయి. ఇటు పంచాయతీ అధికారులు కానీ అటు ఆర్‌అండ్‌బీ అధికారులు కానీ వీటి నిర్వహణ కోసం ఏనాడు ఆలోచించలేదు. ప్రయాణికులు కూర్చుండే అరుగులు పెచ్చులూడి అధ్వానంగా తయారయ్యాయి. చెత్తా చెదారంతో నిండిపోయి కంపుకొడుతున్నాయి. దాంతో ప్రయాణికులు బస్ షెల్టర్లలోకి రావడం మానేశారు.

సైకిళ్ల స్టాండ్‌లా మారాయి..

బస్ షెల్టర్లలోకి ప్రయాణికులు రాకపోవడంతో వాటిని స్థానికులు సైకిళ్ల స్టాండ్లుగా వినియోగించుకుంటున్నారు. విద్యార్థులు, రైతులు గ్రామాల నుంచి ఇక్కడి వరకు సైకిళ్లపై వచ్చి బస్ షెల్టర్లలో పార్కింగ్ చేస్తున్నారు. దాంతో ప్రయాణికులు పూర్తిగా బస్ షెల్టర్లలోకి రావడం మానుకున్నారు. కొన్ని షెల్టర్లు వివిధ వస్తువులను నిల్వ చేసుకునే కేంద్రాలుగా మారాయి. ప్రయాణికులు మాత్రం రహదారులపై నిల్చునే వాహనాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కాసేపు విశ్రాంతి తీరే అవకాశం లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలలోనూ ఇదే దుస్థితి ఉంది. కోటవురట్ల మండలంలో ప్రస్తుతం అన్నవరం జంక్షన్, తంగేడు, సుంకపూరు జంక్షన్, కోటవురట్ల, పాత రోడ్డు, గొట్టివాడ, రామచంద్రపురం జంక్షన్లలో ఉన్న బస్ షెల్టర్లను పాతికేళ్ల క్రితం ఎంపీ నిధులతో నిర్మించగా ఇవన్నీ పూర్తిగా శిథిలమైపోయాయి. వీటికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావలసి ఉంది. ఇక కొత్తగా పాయకరావుపేట మండలంలో పెదరామభద్రపురం, శ్రీరాంపురం, సత్యవరం, మంగవరం, అరట్లకోట, గోపాలపట్నం, నామవరం జంక్షన్లలోనూ నక్కపల్లి మండలంలో ఉద్దండపురం, వేంపాడు, డి.ఎల్.పురం, చినదొడ్డిగల్లు, న్యాయంపూడి, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలంలో పెట్టుగోళ్లపల్లి జంక్షన్, రైల్వే స్టేషన్ జంక్షన్, దార్లపూడి జంక్షన్, ఎస్.రాయవరంలోను, కోటవురట్ల మండలంలో గూడెపులోవ జంక్షన్, పందూరు జంక్షన్, జల్లూరు-బి.కె.పల్లి జంక్షన్, లింగాపురం జంక్షన్, కైలాసపట్నం-టి.జగ్గంపేట జంక్షన్లలో బస్ షెల్టర్లు నిర్మించాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్ షెల్టర్లు నిర్మించి, పాతవాటికి మరమ్మతు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

బస్ షెల్టర్ నిర్మాణం తప్పనిసరి



అన్నవరం జంక్షన్‌లో పాతికేళ్ల క్రితం ఎంపీ నిధులతో బస్ షెల్టర్‌ను నిర్మించారు. నిర్వహణ లేకపోవడంతో పూర్తిగా శిథిలమైంది. ప్రస్తుతం నిరుపయోగంగా ఉండిపోయింది. విద్యార్థులు, మహిళలు ఈ జంక్షన్‌లో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి ఇక్కడ బస్ షెల్టర్ నిర్మించాలి.

– అయ్యపురెడ్డి బాబ్జీ, అన్నవరం

ప్రయాణికులకు తప్పని పాట్లు



మండలంలో ప్రధాన కూడళ్లలో ఉన్న అన్ని బస్ షెల్టర్లు శిథిలమయ్యాయి. శ్లాబ్ పెచ్చులు రాలిపోతున్నాయి. అరుగులు పగిలిపోయి గోతులు పడ్డాయి. చెత్తా చెదారంతో నిండిపోయాయి. 25 ఏళ్ల క్రితం అప్పటి జనాభా ఆధారంగా వీటిని నిర్మించారు. ఇప్పుడు పరిస్థితి చాలా మారింది. దాతలు కూడా ముందుకు వచ్చే ప్రధాన కూడళ్లలో బస్ షెల్టర్లు నిర్మించి కనీస సదుపాయలు కల్పించాలి.

– ఆర్‌ఎస్ సత్యనారాయణరాజు, మాజీ వైస్ ఎంపీపీ, తంగేడు

ఉద్యోగ విరమణ చేసిన టీచర్‌కు సన్మానం



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న ఎంఈవో, తదితరులు

ఎస్.రాయవరం: ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల శేష జీవితం సుఖమయంగా సాగాలని ఎంఈవో శ్రీరామమూర్తి ఆకాంక్షించారు. నారాయణపట్నం ఉన్నత పాఠశాలలో పని చేస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు పి.రామును పాఠశాలలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధనలు, చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డి.రమేష్, పి.వి.నర్సింగరావు, ప్రశాంతి, శేషారావు, టి.భాస్కరరావు, ఆర్.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వర్షం కుమ్మేసింది



కశింకోట వద్ద పొలం మడిలో చేరిన వర్షం నీరు

కశింకోట: ఉరుములు, మెరుపులతో మంగళవారం కశింకోటలో వర్షం కుమ్మేసింది. సుమారు రెండు గంటలపాటు కురిసిన వర్షం వల్ల పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మురుగు కాలువల్లో నీరు రోడ్లపై పారింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయం, పీహెచ్‌సీ, పశువుల ఆస్పత్రులకు వెళ్లే రోడ్లలో నీరు చేరడంతో రాకపోకలు సాగించడానికి ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడ్డారు. భవానీ కాలనీ, ఇందిరా కాలనీ, స్టేట్ బ్యాంకు రోడ్డు ప్రాంతాల్లో రోడ్డుపై నీరు నిలవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. జాతీయ రహదారి రెండు వైపులా దారి పొడవునా పలుచోట్ల నీరు పారడంతో వాహన చోదకులు ఇబ్బందికి గురయ్యారు. ఇటీవల కాలంలో ఇదే భారీ వర్షం కావడంతో పొలాల్లో నీరు చేరింది. ఖరీఫ్ వరి, చెరకు పంటలకు వర్షం బాగా ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

2న జిల్లాస్థాయి ఎడ్లపరుగుపోటీలు

చీడికాడ: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వచ్చే నెల 2వ తేదీ గురువారం అప్పలరాజుపురంలో జిల్లాస్థాయి ఎడ్ల పరుగుపోటీలు నిర్వహించనున్నట్టు సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు తెలిపారు. దేవిమెట్ట మీద వెలసిన లలితాదేవి ఆలయంలో దసరా సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు.

జీఎస్టీ తగ్గింపుపై ఇంటింటా ప్రచారం

దేవరాపల్లి: జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాలపై ఇంటింటా ప్రచారం చేయాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక రైవాడ అతిథి గృహంలో మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 98 రకాల వస్తువుల ధరలు తగ్గాయని ఆయన చెప్పారు. అనంతరం రైవాడలో ఎరకాలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు.

నేత్రపర్వం.. నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం ఉదయం 9.30గంటల నుంచి వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

భవానీ భక్తులకు సత్కారం



తాళ్లపాలెంలో భవానీ భక్తులకు సత్కారం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం నుంచి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయాన్ని కాలినడకన వెళ్లి దర్శించుకుని వచ్చిన భవానీ భక్తులను మంగళవారం ఇక్కడ సన్మానించారు. తాళ్లపాలెం రామాలయం వద్ద దుర్గాదేవి మండపంలో భవానీ భక్తులు ప్రగడ నాగేశ్వరరావు, లక్కు శ్రీనివాసరావులను మండల కో-ఆప్షన్ సభ్యుడు అద్దంకి సతీష్ సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. భవానీ భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్యుల సమ్మె

కశింకోట: మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. రాష్ట్ర వ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా కశింకోట, తాళ్లపాలెం పీహెచ్‌సీల్లో పని చేస్తున్న వైద్యులు మంగళవారం కూడా సమ్మెలో పాల్గొన్నారు. దీంతో ఆరోగ్య సిబ్బంది కొంతమంది సాధారణ రోగులను తనిఖీ చేసి మందులు అందజేశారు.

నేడు ఖాదీ సంత ప్రారంభం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని మెయిన్‌రోడ్ గవర్నమెంట్ హైస్కూల్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు ఖాదీ సంత, రసాయన రహిత బెల్లంతో తయారు చేసిన ఉత్పత్తులు అమ్మే స్టాల్‌ను ప్రారంభిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరావు తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా స్వదేశీ వస్తువులను ప్రోత్సహించడంలో భాగంగా ఖాదీ వస్త్రాలు, అనూష ఆగ్రో ప్రొడక్ట్స్ వారి బెల్లం పొడి, పల్లీ, నువ్వుల చిక్కీలు, మిల్లెట్స్ వంటి ప్రొడక్ట్ విక్రయిస్తారన్నారు.

దుర్గమ్మా.. నమోస్తుతే



హరిపాలెం కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు



అచ్యుతాపురం కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



ఆధ్యాత్మిక గాయత్రి జ్ఞానపీఠంలో కనక మహాలక్ష్మి అమ్మవారి అలంకరణలో..

అచ్యుతాపురం రూరల్ : దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ అలంకారాల్లో దుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తున్నారు. హరిపాలెం హరిగిరి కొండపై కొలువైన కనకదుర్గమ్మ అమ్మవారిని, అందలాపల్లి గ్రామంలో శ్రీభగీరథ అమ్మవారిని యలమంచిలి మాజీ శాసనసభ్యుడు యు.వి.రమణమూర్తి రాజు(కన్నబాబురాజు) మంగళవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయనకు అమ్మవారి చిత్రపటాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు బహూకరించి సత్కరించారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్‌కు ఉత్సవ కమిటీ సభ్యులు చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకుడు మారిశెట్టి సూర్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు, ఎంపీపీ కోన సంధ్యబుజ్జి, కో-ఆప్షన్ సభ్యుడు సర్మాల కుమార్, మండల యువజన విభాగం అధ్యక్షుడు కారుకుండి శ్రీను, వైస్ ఎంపీపీ వాసుపల్లి పద్మశ్రీనివాస్, లోటస్ రాజు, సర్పంచ్ గంగిరెడ్డి లక్ష్మీరాము, ఎంపీటీసీలు రావిలక్ష్మీశోభన, కట్టుమూరు శ్రీను, దుంగా రమణ పాల్గొన్నారు.

● అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు మంగళవారం దుర్గమ్మ అలంకరణలో దర్శనమిచ్చారు. వేకువజాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం వనితా క్లబ్ ఆధ్వర్యంలో భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు 150 మంది పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

ఘనంగా అంబలం పూజ

మునగపాక: మండల వ్యాప్తంగా దుర్గాదేవి శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మునగపాక ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన దీపాలంకరణ అందరినీ ఆకట్టుకుంది. మునగపాక ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి దుర్గాదేవి అమ్మవారి అంబలం పూజ ఘనంగా జరిగింది. దుర్గాదేవి అమ్మవారిని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ దర్శించుకున్నారు. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో అంబలం పూజలో పాల్గొన్నారు.



యలమంచిలిలో దుర్గాదేవి అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు



మునగపాక ఇందిరమ్మ కాలనీలో దీపారాధన

యలమంచిలి రూరల్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో 9వ రోజున అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి పల్లకి సేవ పురవీధుల్లో సాగింది. వాసవీ కూచిపూడి డాన్స్ అకాడమీ నిర్వాహకురాలు అద్దేపల్లి శ్రీవల్లి ఆధ్వర్యంలో శిష్య బృందం నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పెంజెరువు కనకదుర్గమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సమితి ఆఫీసు వీధి ఆధ్యాత్మిక గాయత్రీ జ్ఞానపీఠంలో అమ్మవారిని కనకమహాలక్ష్మి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలో పలుచోట్ల సారె ఊరేగింపు జరిపారు.

ఎస్.రాయవరం: పెట్టుగోళ్లపల్లిలోని దుర్గాదేవి అమ్మవారిని మంగళవారం మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చొప్పా రాజు, పార్టీ నాయకులు వియ్యపు వరహాలరావు, వియ్యపు వెంకటరమణ, నగేష్, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.



పెట్టుగోళ్లపల్లిలోని ఆలయంలో కంబాల జోగులుకు సత్కారం



మునగపాకలో దుర్గాదేవి అంబలం పూజలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాద్

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే జరిమానా



ద్విచక్ర వాహనదారును బ్రీత్ ఎనలైజర్‌తో చెక్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అనకాపల్లి టౌన్: వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేకుంటే జరిమానాలు తప్పవని పట్టణ ట్రాఫిక్ సీఐ ఎం వెంకటనారాయణ హెచ్చరించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంగ్ రూట్‌లో వాహనాలను నడిపినా, నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలను పార్కింగ్ చేసినా, హెల్మెట్ ధరించకపోయినా జరిమానాలు విధిస్తున్నట్లు తెలిపారు.